

కథా కౌముది

# చారులో కలివేపాకు ఆర్ శర్మ దంతుర్తి

"నేను ఉక్రెయిన్ లో మెడిసిన్ చదువుతా," చెప్పేడు మధు తండ్రితో డిగ్రీ అయ్యేక.

"చేరుదువు గానిలే, నీ కొచ్చే మార్కులకి మెడికల్ కాలేజీలో సీటు రావొద్దూ?"

తల్లి అండ చూసుకుని చెప్పేడు కొడుకు, "ఉక్రెయిన్ లో మెడికల్ సీటు సులభం అంటున్నారు. ఖర్చు ఇక్కడ లక్ష అయితే అది ఉక్రెయిన్ లో యాభైవేలు. ఆ లెక్కన ముప్పై లక్షలతో మెడికల్ డిగ్రీ సంపాదించవచ్చు. ఇండియాలో వచ్చిన మార్కులని అంత పట్టించుకోరని అంటున్నారు."

"నువ్వు పదో తరగతే నీలుగుతూ పాసయ్యేవు; ముప్పై లక్షలు నీ మీద పోయాలా? ఆ డబ్బులు మన మూడు మెడికల్ షాపుల బిజినెస్ లో పెట్టడం మంచిది కాదా?"

"నేను డాక్టర్ అయితే రాసే మందుల చీటీలతో లక్షలు సంపాదించడం ఎంతసేపు? ఇండియాలో మెడికల్ కాలేజీలో అయినా ఆ మాత్రం ఖర్చు అవుతుంది కదా? ఇక్కడైనా ఎంట్రన్స్ కోచింగ్, కాలేజీకి ఫీజులూ అన్నీ కలిపి ఇరవై లక్షలౌతుంది."

ఈ మాటల తూటాలు అటూ ఇటూ పేలాక ఒప్పుకున్నాడు తండ్రి. మరో ఆరునెలలకి కుర్రాడు. డొనెట్స్క్ నేషనల్ మెడికల్ యూనివర్సిటీ, డొనెట్స్క్, ఉక్రెయిన్ లో తేలాడు; దీన్ని డోనట్ సూక్ అనీ సరదాకి డోనట్ అనీ అనడం ఎలా ఉన్నా అక్కడికెళ్ళాక తెల్సిన విషయం – మనవాళ్ళు దాదాపు పదివేల మంది ఉన్నారు ఉక్రెయిన్ లో; రోటీ కపడా మకాన్ లకి ఢోకాలేదు. తండ్రి మొదట్లో డబ్బులకి ఏడ్చినా కుర్రాడు చదువులో బాగుపడుతున్నందు లోపల సంతోషిస్తూనే ఉన్నాడు. అయిదేళ్ళు గడిచాక అప్పుడొచ్చింది అనుకోని అవాంతరం – పుటిన్ గారి యుద్ధం రూపంలో. కారణం సోవియట్ యూనియన్ నుంచి ఎప్పుడో విడిపోయిన ఈ ఉక్రెయిన్ రష్యా వారిదేట.

సంవత్సరంలో డాక్టర్ అవుదామనుకున్న మధుతో బాటు మరో వందమందికి ఏం చేయాలో తోచని స్థితి. ప్రతీరోజు పడే బాంబులు చూసి ఇండియన్ ఎంబసీ వారు చెప్పేసారు – ఇండియా వెళ్ళిపోండి. మేమేం చేయలేం. పెట్టె బేడా సర్దుకుంటూంటే మధు అపార్ట్ మెంట్ తలుపు తట్టారెవరో. యుద్ధం రోజులు కనక తలుపులు తీసే పరిస్థితి లేదు. రూమ్మేట్లు ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటున్నప్పుడు దఢేల్ మంటూ తలుపులు విరక్కొట్టుకుని రష్యా సైనికులు లోపలకొచ్చారు. అందర్లోకీ సీనియర్ మధుకి రష్యన్ వచ్చు అని తెలిసాక చెప్పేరు, “మిమ్మల్ని రష్యాకి తీసుకెళ్ళాలి. నోరుమూసుకున్నా, దెబ్బలు తిన్నా సరే.”

“మేము ఇటు ఉక్రెయిన్ కి అటు రష్యాకీ సంబంధించినవాళ్ళం కాదు. ఇండియా వెళ్ళిపోదాం అనుకుంటూ సామాను సర్దుకుంటున్నాం. మాతో మీకేమీ ఉపయోగం ఉండదు కదా,” కంఠం వణుకుతూంటే చెప్పేడు మధు.

“షటప్, మీతో ఉపయోగం అనేది మేము చూసుకుంటాం,” ఉరిమేడు రష్యన్.

కళ్లకి గంతలు, చేతులు విరిచి కట్టి నలుగురు కుర్రాళ్లనీ ఎక్కించాక జీపు బోర్డర్ వేపు సాగిపోయింది.

★ ★ ★ ★ ★

చీకట్లో రోజులు గడుస్తున్నాయి. తామున్నది జైలు అని తెలియడానికి ఎంతో సేపు పట్టలేదు. ఓ చిన్నకంతలోంచి తిండి పెడుతున్నారు. ఇలా కొన్నాళ్ళు గడిచాక కుర్రాళ్లని బయటకి తీసుకెళ్ళడానికి వచ్చారు ఇద్దరు. అరగంట నడిపించాక ఓ హాలూ అక్కడ కూర్చున్న మరో ముగ్గురు రష్యన్ సైన్యం వారూ. పారిపోతారనేమో కాబోలు తమని తీసుకొచ్చిన ఇద్దరు మనుషులూ వెనకగా కాపలా నించునున్నారు. ఉపోద్ఘాతం లేకుండా చెప్పాడు ఓ పెద్దాయన, “కూర్చోండి మీతో మాట్లాడే పని ఉంది. అన్నీ వప్పుకుంటే ఓ అరగంటలో ఇండియాకి పంపించేస్తాం.”

“మాకు తాగడానికి మంచినీళ్ళో మరోటో ఇవ్వగలరా? దాహంతో గొంతుక ఆర్చుకుపోతోంది.” మధు చెప్పేడు.

నీళ్ళ బాటిళ్ళు తెప్పించేడు పెద్దాయన. కుదుటబడ్డాక ఆయనే మొదలు పెట్టాడు, “మీలో ఒకరు అమెరికా వెళ్ళాలి మేమిచ్చే కంప్యూటర్లతో. వెళ్తామని మాట ఇస్తే మిగతవారిని ఇండియా పంపించేస్తాం. లేకపోతే నలుగురూ ఇక్కడే జైల్లో ఎంతకాలమైనా ఉండొచ్చు. ఎవరు మీలో ఒప్పుకుంటారు?”

“అమెరికా అంటే అక్కడకి వచ్చేవాళ్ళలో డ్రగ్స్ ఉన్నాయా మరో మాదక ద్రవ్యాలు ఉన్నాయా ...”

“నోరు మూసుకో. నేను మాదక ద్రవ్యాలనే మాట ఎత్తానా? కంప్యూటర్లు పట్టుకెళ్ళాలి అని చెప్తూంటే?”

“ఏ ఒక్కరు వెళ్ళినా ఫర్వాలేదా?”

“ఔను కానీ రష్యన్, ఉక్రైనియన్ భాష వస్తే మంచిది. ఇంగ్లీషు మీ ఇండియన్స్ కి అందరికీ వచ్చినదే.”

జూనియర్లైన ముగ్గురు కుర్రాళ్ళు, చెప్పేరు, "మా అందర్లోకీ సీనియర్, రష్యన్, ఉక్రైనియన్ వచ్చినవాడు మధు." అడ్డకత్తెర్లో పడ్డట్టూ అయింది మధు సంగతి. ఒకప్పుడు తనకి రష్యన్, ఉక్రైనియన్ భాషలు వచ్చినందు గర్వంగా ఉండేది. అవే ఇప్పుడు తనని పీకలోతు దించబోతున్నాయా? రెండు క్షణాలు ఆలోచించాడు. కనీసం తాను పోయినా ఈ ముగ్గురు కుర్రాళ్ళూ బయటపడతారు. ఇంక తనకి ఎలాగా తప్పదు. చెప్పేడు రష్యన్ అధికారితో, "వాళ్ళని క్షేమంగా పోనిస్తారని గారంటీ ఇస్తే నేను మీ పని చేసిపెట్టడానికి సిద్ధం."

"వాళ్లని ఈ రోజే విమానం ఎక్కిస్తాం. ఇండియా చేరారు అని తెలిసాకే మీరు అమెరికా వెళ్ళొచ్చు. సిద్ధమేనా?"

"సిద్ధమే. ఒక్క ఫోన్ చేసుకుని మా వాళ్ళతో మాట్లాడనివ్వండి. ఈ జైల్ గదిలోంచి మరోచోటకి మార్చగలరా? అక్కడ నేను తినలేను, పడుకోలేను."

"సరే," ముగ్గురు రష్యన్ లూ లేచారు వెళ్ళడానికి. మధు రూమ్మేట్ల మొహంలో సంతోషం.

మధు ఫోన్ చేసి తాను క్షేమంగా ఉన్నాననీ ఏమీ కంగార్లేదనీ చెప్పిన రెండు రోజుల్లో తెలిసాయి మిగతా విషయాలు. తన ముగ్గురు రూమ్మేట్లూ ఇండియాలో క్షేమంగా దిగారు.

★ ★ ★ ★ ★

నాలుగో రోజుకి ఇద్దరు రష్యన్ లు దిగారు మధు రూములోకి. ఇంగ్లీషు లోనే చేయాల్సిన పని టూకీగా చెప్పారు. నాలుగు డెల్ కంపెనీ వారి లాప్ టాప్ లు ఇస్తారు. అవి పట్టుకుని అమెరికా వెళ్ళాలి అక్కడ మీరు పనిచేసేది ఒక కంప్యూటర్ కంపెనీలో; విజిటర్ వీసా అవీ సిద్ధంగా ఉన్నాయి. పేరు కూడా "గిరీశ్ రావు" గా మార్చాము. ఇదిగో కొత్త పాస్ పోర్టు. నాలుగు రోజులు మీతో ఈ కొత్త పేరు అవీ పలికించి తయారుగా ఉంచడానికి ప్రాక్టీస్ ఉంది. ఈ లాప్ టాప్ లని అక్కడ కంపెనీలో వాడుతూ హనీమేటర్ అనే ప్రోగ్రాం ఓపెన్ చేయాలి. మీ పని మీరు చేసుకుంటూన్నప్పుడు అది వైరస్ లని పక్క కంప్యూటర్లలోకీ, అక్కడ్నుంచి గవర్నమెంట్ సిస్టం లలో మెల్లిగా జారుకుంటుంది. అంతే మీరు చేయాల్సిన పని."

"నా పేరు మార్చడం దేనికి? ఈ వైరస్ లు ఇక్కడనుంచే ఆ కంప్యూటర్లలో ఇంటర్నెట్ మీదనుంచి ఎక్కించవచ్చు కదా? అదలా ఉంచితే నేను విజిటర్ వీసా మీద వెళ్తున్నానన్నారు; ఉక్రెయిన్ లోనే స్టూడెంట్ వీసా మీద వచ్చినవాళ్లని బయట పనిచేయనివ్వరు. ఈ వీసా మీద అక్కడ అమెరికాలో పనిచేసుకోవచ్చా? అన్నింటికన్నా ముఖ్యం నేను మెడికల్ కాలేజీ కుర్రాణ్ణి. నాకు కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అవీ రావు. ఎలా?"

"ఇందులో సగం ప్రశ్నలకి సమాధానం నీ దగ్గిరే ఉంది. పేరు మార్చడం దేనికంటే నీ విషయాలు అమెరికాకి ఆల్రడీ తెలుసు – ఇలా మెడికల్ కాలేజీకి ఇక్కడకి వచ్చావు అని. లేదా వాళ్ళు నీ పాస్ పోర్ట్ విషయాలు అడిగితే ఇండియా

ప్రభుత్వం చేతులు కట్టుకుని అన్నీ చెప్పేస్తుంది అమెరికాకి. అందువల్ల పేరు మార్చేం. ఇప్పటివరకూ వైరస్ ఇక్కడనుంచే ఎక్కించాం కానీ ఈ అమెరికా వాడు మా నుంచి వచ్చే ఎటాక్ లని అదుపులో పెట్టాడు. ఇంతకు ముందు రాన్ సం వేర్ అనేదానితో టెక్సాస్ లో ఓ గాస్ కంపెనీని కొట్టాం. ఇప్పుడలా కుదరడం లేదు. నీ కొచ్చిన కంప్యూటర్ జ్ఞానం చాలు. నిన్నే సెలక్ట్ చేయడానిక్కూడా కారణం ఉంది. మీ దేశీయులు ఎంతమంది అమెరికా వెళ్ళినా వాళ్లని పెద్దగా చెక్ చేయరు. అదే రష్యన్ వెళ్తే చెక్ ఎక్కువ. ఉక్రెయిన్ వాళ్లకి మామీద పీకలదాకా కోపం. అందువల్ల వాళ్లని పంపలేం. మధ్యంతరంగా నువ్వే బాగా పనికొస్తావు.”

కొత్త పాస్ పోర్ట్ లో పేరూ వీసా చూసి అడిగేడు మధు, “ఈ వీసా ఎలా సంపాదించారు?”

రష్యన్ నవ్వేడు చిన్నగా, “ఈ పాస్ పోర్టు, వీసా, అందులో నువ్వు పనిచేసే కంపెనీ – ఎక్సెలెన్సీ సాఫ్ట్ వేర్ అనేవన్నీ హైద్రాబాదునుంచి వచ్చినవే. ఈ కంపెనీ దాదాపు ఆరుగుర్ని అమెరికా పంపిస్తోంది. అసలు గిరీష్ రావు ఇండియాలోనే ఉన్నాడు. పోలికల్లో మీరిద్దరూ కాస్త దగ్గిరే. అందులో మిగతా ఐదుగురు వేరువేరు చోట్లకి వెళ్తున్నారు. నువ్వు వెళ్ళేది మాత్రం వాషింగ్టన్. నిన్ను రిసీవ్ చేసుకోవడానికి, నువ్వు ఉండడానికి అన్నీ ఏర్పాటు చేసాం. నువ్వు చేయాల్సిందల్లా ఈ కంప్యూటర్లు వాడి ఒక్కో వైరస్ ఎక్కించడమే. ఓపెన్ చేసాక ఈ హాష్ కోడ్, నీ వేలిముద్రా ఎంటర్ చేయాలి. రోజుకో లాప్ టాప్ వాడుతూ ఈ హనీమేటర్ సాఫ్ట్ వేర్ వాడితే మిగతా విషయాలు అదే చూసుకుంటుంది. ఒక్కో సిస్టం లో మూడేసి వైరస్ లు ఉన్నాయి. ఈ వైరస్ లలో రెండు మూడు పనిచేసినా అమెరికా పని అయిపోయినట్టే.”

“ఈ పని చేసాక నేను ఇండియా వెళ్ళిపోవచ్చా?”

“నీ వీసా మూడు నెలలు. నువ్వు వెళ్ళాక వైరస్ లు కానీ గవర్నమెంట్ సిస్టం లో ప్రవేశించినట్టూ మాకు ఇలా ఎంక్రిప్టెడ్ ఈమెయిల్ పంపించు. వైరస్ కూడా మాకు ఈమెయిల్ పంపుతుంది. అవి మేము చెక్ చేసాక నువ్వు ఇండియా వెళ్ళిపోవచ్చు. ఈ పర్సులో నీకు మూడు నెలలకి కావాల్సిన డబ్బూ, తర్వాత ఇండియా వెళ్ళిపోవడానిక్కావాల్సిన టికెట్ డబ్బూ ఉంది.”

“ఈ వీసా, ఆ ఉద్యోగంలో పనీ, వైరస్ ఎక్కించడం అన్నీ తలో ఒక సవాలు. ఏది తిరిగి ఎటొచ్చినా నామీదకే వస్తుంది. ఇందులో నేను అమెరికాలో జైలుకి వెళ్ళినా మరోటి జరిగినా ఎలా? రష్యానుంచి వస్తున్నావేం అని అడగరా ఎయిర్ పోర్ట్ లో?”

“ఆ రిస్కే నీదే. నీకు వెళ్ళడం ఇష్టం లేకపోతే ఈ జైల్ లోంచి సైబీరియా జైల్ లోకి పంపుతాం. ఉక్రెయిన్ ఆక్రమించడానికి అమెరికా మాకు అడ్డొస్తోంది వాళ్ళకి ఆయుధాలు ఇస్తూ. మేము కనక అమెరికా కంప్యూటర్లని కొట్టగలితే సరైన దెబ్బ తగలవల్సిన చోట తగుల్తుంది. ఇప్పుడు నువ్వు వెళ్ళకపోతే సైబీరియాలో గడపొచ్చు నీ మిగతా జీవితం.

ఇండియాలో మీ కుటుంబం ఒక్కసారి యాత్రలకి బయల్దేరి ఇంక ఎవరికీ కనపడకుండా మాయం అవుతారు ఆలోచించుకో. పాస్ పోర్ట్ లో ఆఖరి పేజీ చూసావా? అందులో నీకు తొంభై రోజులకి రష్యా వీసా ఉంది. నువ్వు ఇక్కడ అరవై రోజులు పనిచేసి అమెరికా వెళ్తున్నావు పని చేయడానికి. ఎవరు అడిగినా అదే సమాధానం."

"నేను అమెరికా వెళ్ళి ఈ పని చేస్తాననీ చేయకుండా పారిపోననీ మీ నమ్మకం ఏమిటి?"

"నువ్వు కాలు కదపకుండా, నీతో ఒక్క మాట మట్లాడకుండా నీకు అమెరికా వీసా, తెప్పించాం; నీ కుటుంబం గురించీ అన్నీ తెల్సుకున్నాం. నువ్వు మోసం చేస్తే రష్యన్ ప్రభుత్వం, నిన్ను నీ కుటుంబాన్నీ నాశనం చేయడానికి వెనకాడదు, మా వంటి మీద ఈగ వాలకుండా. అర్ధం అయిందా?"

వళ్ళు గగుర్పొడుస్తూంటే మధు తలాడించాడు అర్ధమైందన్నట్టూ.

★ ★ ★ ★ ★

వాషింగ్టన్ డల్లెస్ ఎయిర్ పోర్టులోంచి బయటకొచ్చిన గిరీశ్ తనకోసం వచ్చినవారిలో ఒకాయన తన పేరు ఉన్న బోర్డు పట్టుకోవడం చూసి వెళ్ళి పలకరించేడు. అరగంటలో బయటకీ, దగ్గర్లో ఉన్న మరో హోటల్ కి వెళ్ళాక డేవిడ్సన్ తన బిజినెస్ కార్డ్ ఇచ్చి చెప్పాడు, "నేను మళ్ళీ ఎల్లుండి వచ్చి మిమ్మల్ని కంపెనీకి తీసుకెళ్తాను. అప్పటివరకూ విశ్రాంతి తీసుకోండి. భోజనం అదీ కంపెనీ ఖాతాలోకి వేయమని హోటల్ కి చెప్పండి. ఈ నెంబర్ కి ఫోన్ చేయండి ఏదైనా కావాలిస్తే. వీసా ఆఫీసర్ ఏదైనా ఇబ్బంది పెట్టాడా?"

"ఏమీ ఇబ్బంది పెట్టలేదు కానీ నా వీసా నిజమా కాదా పీకి చూడబోయేడు. ఎందుకొచ్చావు, ఎన్నాళ్ళుంటావు, ఒక్క లాప్ టాప్ చాలు కదా నాలుగెందుకు అన్నాడు. ఒక్కో లాప్ టాప్ ఒక్కో పని చేస్తుంది అందువల్ల అన్నీ ఒకే పనిచేయవు అని చెప్పాను. ఒక్కసారి సాఫ్ట్ వేర్ డిటైల్స్ మాట్లడేసరికి కాస్త సర్దుకున్నాడు. మీ ఇండియన్స్ భలే తెలివైనవాళ్లయ్యా అన్నాడు కూడా. ఆయన వంకర నవ్వు మాత్రం నాకు నచ్చలేదు."

"సరే పోనీయండి. ఎల్లుండి కలుద్దాం. బై"

★ ★ ★ ★ ★

పొద్దున్నే లేచిన గిరీష్ బాత్రూం లో దూరి స్నానం చేసి బట్టలు మార్చుకోబోతూంటే తెల్సిన విషయం ఇది – తన లాప్ టాప్ లు నాలుగూ లేవు. ఫోన్ ఎలా వాడాలో తెలియడానికి కొంచెం అవస్థ పడ్డాక, హోటల్ వారికి చెప్పాడు; తాను రూమ్ లోనే ఉన్నాడు. నిద్రలో ఉన్నప్పుడో లేదా తాను బాత్రూంలో దూరినప్పుడో ఈ లాప్ టాప్ లు పోయాయి.

హొటల్ వారి ప్రకారం ఏ నాడూ వాళ్ల హొటల్ లో ఇలా సామాను పోలేదు. వాళ్ళు కనుక్కుంటారు. కంగారు పడకండి అవే దొరుకుతాయి.

డేవిడ్సన్ కి ఫోన్ చేసి చెప్పాడు. ఆయన ఇదంతా తేలిగ్గా తీసిపారేశాడు. ఏమీ కంగారులేదు. లాప్ టాప్ లు చవక హొటల్ మంచిది తప్పకుండా దొంగలని పట్టుకోగలదు. డోన్ట్ యూ వర్రీ. మేము ఉన్నాం కదా?

మూడోరోజు గిరీష్ కంపెనీకి వెళ్ళాడు డేవిడ్సన్ తో. అక్కడ మళ్ళీ ఈ లాప్ టాప్ ల కబుర్లు; గిరీశ్ కి ఉన్న కంగారు వాళ్లకిలేదులా ఉంది. లాప్ టాప్ అయితే మా దగ్గిరవి ఇస్తాం అనేసారు. వాళ్ల లాప్ టాప్ లు తనకి ఎందుకు? ఈ వైరస్ లు కానీ తాను రన్ చేయలేకపోతే తన కుటుంబం పరలోక యాత్ర అని రష్యన్ చెప్పినది గుర్తొచ్చింది. కాళ్ళు వణికేయి.

★ ★ ★ ★ ★

మర్నాడు హోటల్ మేనేజర్ చెప్పేడు – మీ లాప్ టాప్ లు దొరికాయి. వచ్చి తీసుకెళ్ళండి. గిరీష్ వెళ్ళి చూసాడు. అవి తాను రష్యానుంచి తెచ్చినవే. ఎక్కడా చిన్న గీత గానీ, పగులు గానీ లేదు. రూములోకి వెళ్ళాక అన్నింటిలోనూ లాగ్ అయ్యి చూసాడు. హనీ మేటర్ ఉంది. నెట్ వర్క్ కి కనెక్ట్ చేస్తే పనిచేస్తుందని అనుకోవాల్సిందే.

మర్నాడు ఆఫీసు మేనేజర్ అన్నాడు, "మీ లాప్ టాప్ లు దొరికాయిట కదా, సంతోషం. ఇంకేదైనా ప్రోబ్లం ఉందా?"

"ఎవరు కొట్టేసారంటారు నా లాప్ టాప్ లు? నా బేగ్ కవర్లో డబ్బులు ఉన్నాయి. అవి ముట్టుకోలేదు కానీ కంప్యూటర్లే కొట్టేసారు."

"పోనీ లెండి, దొరికాయి కదా? మా ఆఫీసులో ఓ మూడు గంటల ఓరియంటేషన్ ఉంది. ఓ మధ్యవర్తి మీతో మాట్లాడతాడు. ఇదో తప్పని వ్యవహారం. కంపెనీకి వచ్చినప్పుడు మొదట్లో, వెళ్ళిపోయేటప్పుడు చివర్లో ఆయన అడిగినవాటికి సమాధానం చెప్తే చాలు."

"వీసా గురించి అడిగితే ఏం చెప్పమంటారు? నాది విజిటర్ వీసా కదా? పనిచేయకూడదేమో?"

"ఆయన వీసా గురించి అడగడు. మీ ప్రయాణం ఎలా జరిగింది, ఈ కంపెనీలో మూడు రోజుల్లో ఏదైనా వివక్షత చూపించారా అనేవి," కొంచెం మొహమాటం నవ్వులు. మరో గంటకి గిరీష్ మధ్యవర్తి దగ్గిర తేలాడు.

"రండి, నా పేరు జాకబ్. ఎప్పుడొచ్చారు ఈ దేశానికి, ఎలా ఉంది ఇప్పటి వరకూ?"

"మూడు రోజులైంది. లాప్ టాప్ లు కొట్టేసారు హొటల్లో; నిన్ననే దొరికాయి. బేగ్ లో ఉన్న కవర్లో కేష్ ఉంది. అది ముట్టుకోలేదు దొంగలు. లాప్ టాప్ లు మాత్రమే కొట్టేసారు. వింత కదా?"

"మీరు రష్యాలో ఎంత కాలం ఉన్నారు? యుద్ధం వల్ల ఏదైనా ప్రమాదం ఉందా?"

"నేనక్కడ సాఫ్ట్ వేర్ ఇవ్వడానికి వెళ్ళాను. పనై పోగానే అమెరికా వెళ్ళి అక్కడ కూడా పనిచేసి వచ్చేయి అని చెప్పేరు ఇండియానుంచి," రష్యా నేర్పించిన చిలక పలుకులు అప్పచెప్పాడు గిరీశ్.

“ముసుగులో గుద్దులాట ఎందుగ్గానీ ఇదిగో నా కార్డు. నేను ఎఫ్ బి ఐ లో పనిచేసే ఇన్వెస్టిగేటర్ ని. మీ లాప్ టాప్ తీసింది మేమే. మీరు ఎక్కడ్నుంచి వస్తున్నారు, అక్కడ ఏం చేసారు, అసలు మీ పేరు మధు అనీ అన్నీ మాకు తెలుసు. వేషాలు కట్టిపెట్టి ఇప్పుడు చెప్పండి, ఏమిటి మీరు అమెరికా నెట్ వర్క్ మీద ఎక్కించబోయేది?”

“ఏమిటి మాట్లాడుతున్నారు మీరు?”

“చూడు తమ్ముడూ నీ అసలు పేరుతో సహా అన్నీ చెప్పాను కదా? మీ లాప్ టాప్ లు తీసి అందులో ఏముంది, మీరు ఏం చేయబోతున్నారనేవి కూపీ లాగాం. మీరు తెచ్చిన హనీ మేటర్ మమ్మల్ని వేలి ముద్రలూ, మీ దగ్గిర ఉన్న మరో హాష్ కోడ్ అడుగుతోంది – దీన్ని త్రీ ఫేక్టర్ ఆథెన్టికేషన్ అంటారు. నీ మెడికల్ బుర్రకి అవి తెలియవు. ఉక్రెయిన్ లో నిన్ను పట్టుకుని తీసుకెళ్లి ఏం చెప్పారు రష్యావారు?”

“ఇవన్నీ మీకెలా తెలుసు,” పాలిపోయిన మొహంలో ఏడుపు తన్నుకొస్తూంటే అడిగేడు మధు.

“మేము ఎఫ్ బి ఐ. అని చెప్పాను కదా? మనిషి వంటి మీద చిన్న వెంట్రుక ముక్క దొరికితే చాలు మిగతా విషయాలు అన్నీ పది నిముషాల్లో లాగుతాం. ఈ సాఫ్ట్ వేర్ తో నిన్నేం చేయమని చెప్పారు?”

దాదాపు ఏడుస్తూ మొత్తం కథ చెప్పాడు మధు – నేను అటు రష్యావాణ్ణీ కాదు ఇటు ఉక్రెయిన్ వాణ్ణీ కాదు నన్ను మధ్యవర్తిగా పెట్టుకుని రష్యా ఈ సాఫ్ట్ వేర్ ని మీ నెట్ వర్క్ మీద ఎక్కించమని చెప్పారు. ఓ సారి ఓపెన్ చేయగానే నా వేలిముద్ర, ఈ కోడ్ అడుగుతుంది. ఈ కోడ్ హాష్ కోడ్ కనక దాన్ని మీరు పట్టుకోలేరని చెప్పారు. అలా ఎక్కించగానే నన్ను ఇండియా పంపించేస్తారనీ, ఈ పని చేయకపోతే నన్ను నా కుటూంబాన్నీ సర్వనాశనం చేస్తామనీ బెదిరించారు. ఇప్పుడు చెప్పండి నా తప్పు ఏవుంది ఇందులో? నన్నేం చేయమంటారు?”

“నేను చెప్పినది నువ్వు చేస్తావా?”

“చేస్తే నేనూ నా కుటుంబం క్షేమంగా ఉంటుందా?”

“గారంటీ ఇవ్వలేను కానీ నాకు చేతనైంది నేను చేస్తా.”

“అంటే నేనూ నా ఇండియా కుటుంబం చావక తప్పదా?”

“నువ్వు మాతో కోపరేట్ చేస్తే నిన్ను ఇండియా పంపిస్తాం. మీ ప్రభుత్వానికి ఓ మాట చెప్తాం. ఇలా మాకు సహాయం చేసాడు. రష్యా వారినుంచి ఈయనకి ప్రమాదం ఉంది కాస్త కనిపెట్టుకు ఉండండి అని. వాళ్ళు ఏం చేస్తారో మాకు తెలియదు కానీ మీ ఛాన్స్ ఫిఫ్టీ ఫిఫ్టీ. మాకు సహాయం చేయకపోతే ఇక్కడ జైల్లో ఉండొచ్చు కావాల్సినంతకాలం. ఏమాటకామాట చెప్పుకోవాల్సిందే – మాజైళ్ళు సైబీరియా జైళ్ళకన్నా చాలా బెటర్.”

"ఇవన్నీ ఎలా తెలిసాయండి మీకు?"

"యుద్ధం జరుగుతుంటే, జరగనప్పుడు వచ్చే దేశం ఫలానా అయితే ఎవరు ఎక్కడనుంచి వస్తున్నారు, ఏం పట్టుకొస్తున్నారు అనేవి ఇమ్మిగ్రేషన్ వారు చూస్తూ ఉంటారు. వాళ్ళు మాకు మాట చేరవేయగానే మేం రంగంలోకి దిగుతాం. నీ లాప్ టాప్ ల గురించి ఇమ్మిగ్రేషన్ ఆయన ఏమైనా అడిగాడా?"

"నాలుగెందుకు ఒకటో రెండో చాలు కదా అన్నాడు."

"సో, అలా దొరికిపోయారన్నమాట. మీ లాప్ టాప్ లో సాఫ్ట్ వేర్ హనీ మేటర్ ని చూసాం.  గమనించారా, రష్యా మిమ్మల్ని చారులో కరివేపాకులాగా వాడుకుందామని చూస్తోంది. పని అవగానే తీసి మురికి కాలవలో పారేస్తారు."

"నా సంగతి ఆలోచించండి, నాకు ఏమిటి వేరే దారి?"

"చారులో కరివేపాకు అంత పనికిరానిది కాదని ప్రూవ్ చేయడమే. కరివేపాకు పారేయకుండా తింటే, సైన్స్ చూపిస్తున్నట్టూ అది తెలివితేటలు పెంచుతుందని నిరూపించడమే. ఒప్పుకుంటానంటే మా కంప్యూటర్ కుర్రాడు చెప్తాడు ఏం చేయాలో," జాకబ్ లేచి వెళ్ళి ఎవర్నో పిల్చేడు లోపలకి రమ్మని.

పక్కగదిలోంచి వచ్చిన ఎఫ్ బి ఐ కుర్రాడు చెప్పడం మొదలుపెట్టాడు. మీ వేలిముద్ర, హాష్ కోడ్ ఇవ్వగానే మేము లాగ్ ఇన్ అయి మిగతా విషయాలు చూస్తాం. ఆ వైరస్ ఏమిటి ఏమి చేస్తుందనేది ఒక హనీ నెట్ అనే నెట్ వర్క్ మీద చెక్ చెస్తాం. హనీ నెట్ అంటే మీకు తెలుసా?"

"నేను ఫైనల్ ఇయర్ మెడికల్ కాలేజ్ కుర్రాణ్ణి, మైక్రోసాఫ్ట్ వర్డ్, ప్రెజెంటేషన్ కి మరో సాఫ్ట్ వేర్ తప్ప ఇటువంటివి నాకు ఎలా తెలుస్తాయి?"

"హనీ నెట్ అనేది ఒక ఫేక్ నెట్ వర్క్. హాకర్స్ నీ, ఎటాకర్స్ కీ దాన్ని చూపించి అదో నిజం నెట్ వర్క్ అనుకునేలా చేయడమే దాని పని. హాకర్స్ ఓ సారి ఆ నెట్ వర్క్ లోకి వెళ్ళగానే హనీ నెట్ వాళ్ల సంగతులన్నీ కనిపెట్టి మాకు చేరవేస్తుంది. మేము ఆ రిజల్ట్స్ పట్టుకుని హాకర్స్ ఎక్కడున్నారు, ఏం చేయబోతున్నారనేవి పట్టుకుంటాం...."

"ఆగండాగండి. మీ పని చేసుకుంటారు సరే, కానీ నేను వెంఠనే ఈ వైరస్ లని నెట్ వర్క్ మీదకి ఎక్కించకపోతే నన్ను చంపుతామని రష్యన్లు అన్నారు. ఈ వైరస్ లు అన్నీ నెట్ వర్క్ మీద ఎక్కించగానే వాళ్లకి తెలుస్తుందిట. లేకపోతే అంతే."

"మీరు ఎవర్ని ఎక్కడ కలిసారు, వాళ్ళు ఏం చేయమన్నారు అనే విషయాలు చెప్తే ఈ హనీ నెట్ వర్క్ వాళ్లకి కనిపించేలా దిద్దుతాం. ఈ హనీ నెట్ అచ్చు అసలు నెట్ వర్క్ లాగానే ఉంటుంది. ఏమీ తేడా కనిపించదు. వాళ్ళు అది చూసి మీకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు ఇండియా వెళ్ళిపోవడానికి. తర్వాత మా పన్లు మేము చేసుకుంటాం."

"ఇండియాలో నా కుటుంబం సంగతో?"

దీనికి జాకబ్ చెప్పాడు సమాధానం, "చెప్పాం కదా? మీరు బయల్దేరే ముందే ఇండియా ప్రభుత్వానికి చెప్తాం. ఈ విమానంలో వచ్చే ఫలానా కుర్రాడు మాకు సహాయం చేసాడు; శత్రుదేశాలనుంచి మీకు మీ ప్రభుత్వాలకీ అపాయం ఉంది. వీణ్ణి సరిగ్గా చూసుకోండి అని."

"ఒక్కమాట చెప్తే చాలా? మీరు చెప్పిన కాయితం, మాటా ఏమూలకి పనికొస్తాయి?"

"అలా అనుకోకు; నమో మంచివాడే. మేము చెప్తే వింటాడు.

"ఇలా దేశాలు ఒకరిమీద ఒకరు ఆడుకుంటూ నన్ను పావులా వాడుకోవడం దారుణం."

"ఇదంతా పార్ట్ అండ్ పార్సెల్ ఆఫ్ పాలిటిక్స్ బ్రదర్. మేము నీకు సహాయం చేస్తున్నాం. ఆ మాట మర్చిపోకు."

★ ★ ★ ★ ★

నాలుగు లాప్ టాప్ లలో ఎఫ్ బి ఐ. చూసిన వైరస్ లు మొత్తం పన్నెండు దాకా ఉన్నాయి. అవి నెట్ వర్క్ మీదకి ఎక్కించాక మిగతా చోట్లకి ఎలా వెళ్తుందనేది తెల్సాక హనీ నెట్ మీదకి ఎక్కించారు. హనీ నెట్ మిగతా విషయాలు రాబట్టింది. వైరస్ లలో రాన్ సం వేర్ అనేదొకటి – గవర్నమెంట్ వెబ్ సైట్లని బ్లాక్ చేస్తుంది అడిగినన్ని డబ్బులు ఇచ్చేదాకా. మరోటి ఉన్న ఫోటోలనీ మిగతా ఇమేజ్ ఫైళ్ళనీ మార్చి అందులో స్టిగానోగ్రాఫ్ వైరస్ జొప్పించి మిగతా చోటకి పంపుతుంది. మిగతావి మరో రకం.

హనీ నెట్ మీద ఇవి ఎక్కించగానే గిరీశ్, ఉరఫ్ మధు రష్యావారికి ఈమెయిల్ సంకేతం పంపించాడు – "జీవితం పరమానందం, హనీహంటర్ తేనె కంటె మధురం." ఈ లోపుల అమెరికా గవర్నమెంట్ ఒక ప్రెస్ మెసేజ్ పంపించారు పత్రికలకి – రష్యా నుంచి కొత్త వైరస్ లు; నిలిచిపోయిన ప్రభుత్వ సేవలు. దానితో పాటు ప్రజలకో వార్నింగూ, ఈమెయిల్స్ తో జాగ్రత్తగా ఉండమనీ, హనీ నెట్ మీద ఆగిపోయినట్టు కనిపించే సర్వీస్ లూ అన్నీ చూపిస్తూ ఫోటోలూ పెట్టారు. అవన్నీ అటు రష్యా కూడా చూడొద్దూ?

మూడు రోజులకి మధు కి సమాధానం ఈమెయిల్ మీద వచ్చింది – అది ఎఫ్ బి ఐ వారు ట్రాక్ చేసారు కూడా దారిలో – "సంతోషం సగం బలం." దానికింద ఒక మ్యూజిక్ ఫైల్ ఉంది. అది తెరిస్తే ఒక చిన్న పాట. "టా టా వేడికోలు, గుడ్ బై ఇంక శెలవు తొలినాటి స్నేహితులారా... "

అది చూసాక మధు హైద్రాబాద్ వెళ్ళే విమానం ఎక్కాడు; పక్కనుంచి ఎఫ్ బి ఐ వారి ఏజెంట్ మామూలు దుస్తులలో చూస్తూంటే. తర్వాత అమెరికా ఓ కాయితం పంపించారు ఇండియన్ గవర్నమెంట్ కి – ఫలానా కుర్రాడు మాకు ఇలా

సహాయం చేసాడు. వీడికీ మీకూ మీ మిత్రదేశం అని చెప్పుకునే శత్రుదేశం నుంచి ప్రాణగండం ఉంది; జాగ్రత్తగా చూసుకోండి.

ఆ కాగితం ఢిల్లీ, హైద్రాబాద్ లకీ అక్కడ్నుంచి ఆఘమేఘాలమీద మిగతా పోలీస్ డిపార్ట్ మెంట్లకీ అందజేయబడింది. అలా మధు కథ సుఖాంతం అయింది.

మరో రెండు నెలలకి అసలు విషయాలు తెలిసేయి అమెరికా రష్యాని ఎలా బోల్తా కొట్టించిందో. హనీ మేటర్ అనే వైరస్ లని ఎక్కించబోతే వాటిని హనీ నెట్ మీదకి ఎక్కించి రష్యావాడి పిలక లాగడం, వాళ్ళు బుట్టలో పడి నిజం అనుకోవడం అనే కథంతా. ఇవి పెద్ద పత్రికలైన న్యూయార్క్ టైమ్స్, టైమ్, వాషింగ్టన్ పోస్ట్ అనేవాటిలో మొదటి పేజీలో వచ్చేయి. ఔరా రష్యా అని ఆశ్చర్యపోయింది ప్రపంచం. ఇటువంటి పనులు తగవంటూ మిగతా దేశాలు తలో స్టేట్ మెంట్ పారేసాయి. ఉత్తరోత్తరా ఈ వార్త రష్యా చేరింది.

"ఈ మధు ఆద్మీ హమ్ కో ధోకా దియా" అనుకున్నారు కానీ వాళ్లకి ఈ ఎఫ్ బి ఐ వెనకనుంచి చేసిన పన్నాగం తెలియలేదు. వార్తని ఖండిస్తూ వాళ్ళు మరో ప్రకటన చేసారు, "ఈ అమెరికా ఉంది చూసారూ? ప్రతీ దానికీ మా రష్యాదే తప్పు అంటారు. వాళ్ళకి ఎవరో ఇండియన్ కుర్రాడు వైరస్ ఎక్కించబోయేట్ట, అది మా తప్పని చూపిస్తున్నారు. రేప్పొద్దున్న వీళ్లకి కడుపునెప్పెట్టినా వయస్సు వచ్చి జుట్టు తెల్లబడినా రష్యాదే తప్పు అంటారు. ఉత్తినే మాకు అంటగట్టకండి ఈ వివాదాలన్నీ. ఉక్రెయిన్ మాది. దాన్ని ఆక్రమించడానికి మేము వెనుకాడం."

ఈ వార్తలన్నీ మధు, ఉరఫ్ గిరీశ్ చూస్తూనే ఉన్నాడు. యుద్ధం మొదలైన నాలుగు నెలలకి ఇదెలాగా ఇప్పట్లో తెమిలేది కాదని తెల్సాక మధు హైద్రాబాద్ వెళ్ళి తనగోడు చెప్పుకున్నాడు ప్రభుత్వంలో పెద్దవారికి. మెల్లిగా అది పైపైకి చేరింది. అసలే ఆఖరు సంవత్సరం మెడిసిన్ లో ఉన్నాడు. దేశానికి, సాఫ్ట్ వేర్ కంపెనీలు అన్నీ హైద్రాబాదు రావడానికి ఆసక్తి చూపించే అమెరికాకి, సహాయం చేసాడు అడిగినట్టూ. అందువల్ల ప్రత్యేకమైన రికమండేషన్ తో ఇండియాలో మెడికల్ కాలేజీలో జేర్చబడ్డాడు, హౌస్ సర్జన్ గా.

చారులో ఏ కరివేపాకైతే రష్యా వాడు పనికిరాదనుకున్నాడో అదే కరివేపాకు రెబ్బ రష్యాని కోలుకోలేని దెబ్బకొట్టింది. అహం అణుచుకోలేని ఆ దేశం మాత్రం ఇంకా యుద్ధం సాగిస్తూనే ఉంది.

COMMENTS